క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలి



పెద్దశంకరంపేటలో 108 వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): జిల్లాలో కొనసాగుతున్న 108, 102 సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా పోగ్రాం ఆఫీసర్ జనార్దన్ అన్నారు. మంగళవారం పెద్దశంకంపేటలోని ప్రభుత్వాస్పత్రిలో 108, 102 వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే 108 సిబ్బంది స్పందించి చర్యలు చేపట్టాలని, 102 వాహనాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎంఓ అధికారి మహేశ్, పైలెట్ రమేశ్, ఏఎంటీ సంగమేశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్‌లో అందుబాటులో జీలుగు విత్తనాలు



కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో వచ్చిన జీలుగు బస్తాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ మంగళవారం తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. 65 బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సబ్సిడీ పోను 30కిలోల బస్తా రూ. 1,116కు లభిస్తుందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



పవన్ కల్యాణ్ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గవ్వలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం .. మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన భూపాల నర్సింలు కుమారుడు పవన్ కల్యాణ్(19) బ్యాండ్ కొడుతూ పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న ఇంటి ఎదుట పురుగుల మందు తాగి పడిపోయాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజలు కాంగ్రెస్ పక్షమే

నర్సాపూర్: నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పక్షమే ఉన్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల తీర్పును స్వాగతిస్తామన్నారు. ప్రస్తుతం తమకు కొన్ని ఓట్లు తగ్గినా ప్రజలు మా పక్షమే ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులందరం సమిష్టిగా పని చేసినందునే తమను ప్రజలు ఆదరించి మెజారిటీ ఇచ్చారని చెప్పారు.

రెండో స్థానంలోకి బీఆర్ఎస్

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు 72వేల376 ఓట్లతో ప్రథమ స్థానంలో ఉన్నాడు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి 54 వేల 372 ఓట్లతో ద్వితీయ స్థానంలో, 51వేల 811 ఓట్లతో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తృతీయ స్థానంలో ఉన్నారు. కాగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై 18,004 ఓట్ల ఆధిక్యత సాధించింది. కాగా కాంగ్రెస్‌కు అసెంబ్లీ ఎన్నికల కన్న ప్రస్తుతం 6581ఓట్లు తక్కువగా వచ్చినప్పటికీ ఆ పార్టీ ప్రథమ స్థానంలో నిలిచింది. బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో 22వేల 865 ఓట్లు రాగా, ప్రస్తుతం 51వేల 811 ఓట్లు రావడంతో బీజేపీకి ప్రస్తుత ఎన్నికల్లో 28వేల946 ఓట్లు పెరిగాయి.

మోదీ హవాతోనే బీఆర్ఎస్‌కు నష్టం..

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హవా, అయోధ్యలో రామమందిరం నిర్మాణంతోనే బీజేపీకి ఓట్లు పెరిగాయని అభిప్రాయాలు వస్తున్నాయి. మోదీ హవాతో ఆ పార్టీకి భారీగా ఓట్లు పెరగడంతో బీఆర్ఎస్‌కు గండి పడిందనే అంటున్నారు.



చిన్నశంకరంపేటలో బీజేపీ నాయకుల సంబురాలు



రామాయంపేటలో బీజేపీ కార్యకర్తల సంబరాలు

బీజేపీ నాయకుల సంబరాలు

జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి, ర్యాలీ నిర్వహించారు.



చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



నర్సాపూర్‌లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు



మనోహరాబాద్(తూప్రాన్): దండుపల్లిలో బీజేపీ నాయకులు



పాపన్నపేట(మెదక్): టపాసులు కాలుస్తున్న నేతలు



తూప్రాన్‌లో ..



వెల్దుర్తిలో..



నిజాంపేటలో ..



కొల్చారంలో..



కౌడిపల్లిలో..

ఐటీఐతో ఉద్యోగావకాశాలు

ప్రభుత్వ ఐటీఐలో 136 ఖాళీలు
ఈనెల 10 దరఖాస్తులకు తుది గడువు

మెదక్ కలెక్టరేట్: ఐటీఐ శిక్షణతో చాలా జాబ్స్ లభించే అవకాశాలు ఉన్నాయని మెదక్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 6 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా, ఒకే ఒక్క ప్రభుత్వ ఐటీఐ (ఇండస్ట్రీయల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్)ఉందని తెలిపారు. ఇందులో ప్రస్తుతం 136 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కోపా(48), డిజిల్ మెకానిక్(24), ఫిట్టర్(20) ఎలక్ట్రిషియన్(20), డ్రాఫ్ట్‌మెన్ సివిల్(24) సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి ఫీజు ఉండదని, ఇతర వర్గాలకు కేవలం రూ.60లతో అడ్మిషన్స్ ఉంటాయన్నారు. అలాగే ప్రభుత్వం పుస్తకాలు అందజేస్తున్నట్లు వివరించారు. ఐటీఐ పూర్తయ్యాక అప్రెంటీస్ చేసిన వారికి నేరుగా ఉద్యోగంలో తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మంచి జీతం కూడా లభిస్తుందని తెలిపారు. పదో తరగతి పాసై ఉన్నత విద్యనభ్యసించలేని వారికి ఐటీఐ గొప్ప అవకాశమన్నారు. అలాగే ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్‌లో నేరుగా సెకండీయర్ చేరే అవకాశం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మెదక్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో డిజిటల్ క్లాస్‌లు వింటున్న విద్యార్థులు

ఓటర్లకు కృతజ్ఞతలు

: జెడ్పీటీసీ విజయ్ కుమార్

నిజాంపేట(మెదక్): మెదక్ అసెంబ్లీ నియోజక వర్గంలో బీజేపీకి పట్టం కట్టిన ఓటర్ మహాశ్రేయులకు మెదక్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి, నిజాంపేట మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసపూరిత హామీలకు చెప్ప పెట్టుగా సమాధానం ఇచ్చారన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా రఘునందన్‌రావు గెలుపుకు కృషి చేసిన నియోజక వర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పదిశాతం పెరిగిన టోల్ చార్జీలు

తూప్రాన్: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో వాహనాల టోల్ చార్జీలు 10 శాతం పెంచుతూ ఎన్‌హెచ్ఏఐ సోమవారం నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో టోల్ చార్జీలు పెంచుతూ వస్తుంది. కానీ ప్రస్తుత లోకసభ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసిన అధికారులు ఎన్నికలు పూర్తి కావడంతో సోమవారం నుంచి 10 శాతం ధరలు పెంచుతూ నిర్ణయించడంతో అమల్లోకి వచ్చాయి. పెరిగిన టోల్ ధరలతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్ చార్జీలు పెంచడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

సురేష్ షెట్కార్ గెలుపుపై హర్షం



పెద్దశంకరంపేటలో నాయకుల సంబురాలు



రేగోడ్(మెదక్): సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్‌కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించి, టపాకాయలు పేల్చి, స్వీట్లు తినిపించుకొని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్ గెలుపొందడంతో రేగోడ్ మండలంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి డ్యాన్సులు చేశారు. ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు.

కౌడిపల్లిలో కాంగ్రెస్‌కు 2,255 ఓట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంపీ ఎన్నికల్లో కౌడిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి 2,255 ఓట్లు వచ్చాయి. మండలంలోని 39 బూత్‌ల్లో 29,250 ఓట్లు ఉండగా, 24,785ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో కాంగ్రెస్‌కు 9,475ఓట్లు రాగా బీఆర్ఎస్‌కు 7,220 ఓట్లు, బీజేపీకి 4,310ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌కు 2,255ఓట్లు ఎక్కువగా వచ్చాయి. మండలంలోని వెల్మకన్న, బూరుగడ్డ పంచాయతీల్లో బీజేపీకి అధిక్యం రాగా, భుజిరంపేట, పీర్యతండా, కొట్టాల, మహ్మద్‌నగర్, నాగ్సాన్‌పల్లి పంచాయతీల్లో బీఆర్ఎస్‌కు, ఎక్కువ గ్రామాల్లో కాంగ్రెస్‌కు అధిక్యం వచ్చింది.

శివ్వంపేట మండలంలో 948 అధిక్యం

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ పార్లమెంట్ ఫలితాల్లో శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. మండలంలోని 52 బూత్‌లకు సంబంధించి కాంగ్రెస్‌కు 11,557, బీఆర్ఎస్‌కు 10,573, బీజేపీకి 7,374 ఓట్లు రాగా 948 ఓట్లు కాంగ్రెస్‌కు ఎక్కువ వచ్చాయి. ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగ్రామైన గోమారంలో కాంగ్రెస్‌కు 216 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. జెడ్పీటీసీ మహేష్‌గుప్తా స్వగ్రామైన శివ్వంపేటలో బీఆర్ఎస్‌కు 430 ఓట్ల ఆధిక్యం రాగా, ఎంపీపీ హరికృష్ణ స్వగ్రామమైన ఎదుల్లాపూర్‌లో బీఆర్ఎస్ 64 ఓట్ల ఆధిక్యం సాధించారు. మండల వ్యాప్తంగా బీజేపీకి గ్రామస్థాయి నుంచి బలమైన క్యాడర్ లేనప్పటికి ఆ పార్టీకి 7,374 ఓట్లు వచ్చాయి.

కొల్చారం మండలంలో కాంగ్రెస్ ఆధిక్యత

కొల్చారం(నర్సాపూర్): మెదక్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్‌కు 878 ఓట్ల ఆధిక్యత లభించింది. మండలంలో కాంగ్రెస్ పార్టీకి 7549, బీజేపీకి 6971, బీఆర్ఎస్ 5889 ఓట్లు పోలయ్యాయి.

రంగంపేటలో బీజేపీకి భారీ ఆధిక్యత

మండలంలోని రంగంపేటలో మునుపెన్నడూ లేని విధంగా బీజేపీకి 290 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక్కడ అధికార కాంగ్రెస్‌కు 648 ఓట్లు రాగా బీఆర్ఎస్ 412, బీజేపీకి 938 ఓట్లు పోలయ్యాయి. బీజేపీకి ఈ స్థాయిలో ఓట్లు రావడం, ఆపై రఘునందన్‌రావు గెలవడంతో పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలు గ్రామంలో టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అంబరాన్నంటిన బీజేపీ విజయోత్సవాలు



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్ రూరల్: పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. బీవీఆర్ఐటీ కౌంటింగ్ కేంద్రం నుంచి సర్టిఫికెట్‌తో బయటకు వచ్చిన ఎంపీ రఘునందన్‌రావుకు ఆ పార్టీ శ్రేణులు పూల మాలలు వేసి ఘనంగా స్వాగతం పలికాయి. ప్రచారరథం ఎక్కిన ఆయన అందరికీ అభివాదం చేశారు. కార్యకర్తలు నత్యాలు చేస్తూ, బాణసంచా కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీయాదవ్, గడ్డం శ్రీనివాస్, రఘువీరారెడ్డి, సంఘసాని సురేశ్, బుచ్చేష్ యాదవ్, రాజేందర్, అంజి గౌడ్, శ్రీనివాస్ గుప్తా, బాల్ రాజు, ఎరుకల యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధితో రైతులకు లబ్ధి



కట్ట మరమ్మతులు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): స్వచ్ఛంద సంస్థలు చెరువులను అభివృద్ధి చేయడంపై రైతులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలోని సింగయ్య చెరువుని షెగల్ స్వచ్ఛంద సంస్థ అభివృద్ధి చేస్తుండడంతో ఆదివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. కట్ట వెడల్పు పటిష్టంగా చేయాలని నిర్వాహకులకు సూచించారు. సుమారు 30 లక్షల నిధులతో స్వచ్ఛంద సంస్థ గ్రామ చెరువు పూటికి తీయడంతో పాటు, కట్ట వెడల్పు, తూము మరమ్మతులు చేపట్టడడం అభినందనీయమన్నారు. వర్షాకాలం సమీపించినందున పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షెగల్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ వేమనారాయణ, గ్రామస్తులు ఉన్నారు.

ధాన్యం తడిసిపోయిందని వెనక్కి..

రైతుల నిరసన



ధాన్యం డీసీఎం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం నుంచి తూకం వేసి రైస్‌మిల్‌కు తరలించిన ధాన్యం తిరిగి పంపించడంపై రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం తూకం వేసి డీసీఎంలో రైస్‌మిల్‌కు తరలించారు. అనంతరం ధాన్యం తడిసిపోయాయని తిరిగి పంపించడంపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో ధాన్యం తరలింపు చేపట్టకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు నర్సింలు, మల్లేశ్, భిక్షపతి, రమేశ్, నవీన్ అన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్మకం కోసం ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వారు వాపోయారు. ఈ విషయం గురించి పీఏసీఎస్ సీఈఓ మధు దృష్టికి తీసుకెళ్లగా.. తూకం అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద వర్షం రావడంతో ధాన్యం తడిపోయిందని రైస్‌మిల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కస్తామన్నారు.



మంత్రి దామోదరను సన్మానిస్తున్న నాయకులు

మంత్రితో కాంగ్రెస్ నేతలు

టేక్మాల్(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని నాయకులు ఘనంగా సన్మానించారు. సురేష్ షెట్కార్ గెలుపుకోసం కృషి చేసిన నాయకులను, కార్యకర్తలను అభినందించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్



మాట్లాడుతున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా అడ్మిషన్ చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండా ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి టీసీ, స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ రూపంలో అందినకాడికి దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, విజయ్, అనుష, మౌనిక, హారిక తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోళ్లు బంద్

రైతుల అవస్థలు
- చేతులెత్తేసిన కొనుగోలు కేంద్రం సిబ్బంది
- ఆన్‌లైన్ బంద్ చేసిన ప్రభుత్వం



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు



అల్లాదుర్గం జొన్నల కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యం

అల్లాదుర్గం(మెదక్): రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. జొన్నల కొనుగోలు కేంద్రం మూసి వేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. జొన్నలు అమ్మేందుకు వారం రోజుల ముందే కొనుగోలు కేంద్రానికి రైతులు జొన్నలు తెచ్చారు. కొనుగోలు కేంద్రం సిబ్బంది రైతులకు టోకెన్‌లు సహితం ఇచ్చారు. ప్రభుత్వం ఆన్‌లైన్ బంద్ చేసిందని, జొన్నల కొనుగోలు కేంద్రం మూసి వేయడంతో రైతులు అవస్థలు పడ్డ సంఘటన అల్లాదుర్గం జొన్నల కొనుగోలు కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. అల్లాదుర్గంలో ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. వారం రోజుల క్రితమే రైతులు జొన్నలను కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. జూన్ 3 చివరి రోజని మంగళవారం నుంచి రైతుల నుంచి జొన్నల కొనుగోలును పీఏసీఎస్ అధికారులు నిలిపివేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంగళవారం రాత్రి నుంచి ఆన్‌లైన్ బంద్ చేసిందని తాము ఎమి చేయలేమని కొనుగోలు కేంద్రం సిబ్బంది చేతులేత్తేశారు. అల్లాదుర్గం కొనుగోలు కేంద్రం వద్ద నాలుగు లారీల జొన్నలు నిల్వ ఉన్నాయని ఇప్పుడు కొనుగోలు చేయకుంటే తమ పరిస్థితి ఎమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న జొన్నలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్ వివరణ కోరగా… జూన్ 3 కంటే ముందే రైతులు జొన్నలు తెచ్చింది వాస్తవమేనని పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్ చెప్పారు. ప్రభుత్వం ఆన్‌లైన్ బంద్ చేయడంతో కొనుగోలు చేయడం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఆదేశించి ఆన్‌లైన్ ఓపెన్ చేస్తే తెచ్చిన ధాన్యం కొంటామని చెప్పారు.